## క్లుప్తంగా

### జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



పరుశురాంను పరామర్శిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త ఇసురు పరుశురాం తల్లి, జగన్నాథపురం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు దుర్గాశి ఋషి భార్య మృతి ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ శనివారం పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ బోర పుష్ప, మండల పార్టీ అధ్యక్షుడు పి.రాజశేఖర రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు ఇసురు తులసీరాం, నీలాపు సారధిరెడ్డి, ఇసురుయాధవరెడ్డి, ఆశి పురుషోత్తం, ఆశి కృష్ణారెడ్డి, బాకి లక్ష్మీనారాయణ, పిట్ట ఆనంద్, ఎస్.చిరంజీవి, నీలాద్రి, పిట్ట బాలయ్య ఉన్నారు.

### రేషన్ డీలర్లకు ఈ-పాస్ యంత్రాలు పంపిణీ



ఈ-పాస్ యంత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కంచిలి: ప్రభుత్వ రేషన్ దుకాణాల డీలర్లకు ఈ–పాస్ యంత్రాలను సీఎస్‌డీటీ పి.కూర్మారావు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక సివిల్ సప్లయిస్ గొడౌన్ సమీపంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 192 మంది డీలర్లకు వీటిని అందజేశారు. ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన నేపథ్యంలో కొత్త మిషన్లను అందజేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

### భానుప్రకాష్‌కి వీసీ అభినందనలు



భానుప్రకాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ గంగాధర్‌రావు

వజ్రపుకొత్తూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 49వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఇదే యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నగరంపల్లి గ్రామానికి చెందిన శిష్టు భానుప్రకాష్ 50 వసంతాల గోల్డెన్ జూబ్లీ లోగోను రూపొందించారు. దీంతో భానుప్రకాష్‌ను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు అభినందించి నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందించి సన్మానించారు. విద్యార్థి ప్రతిభపై వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

### ఎస్సీ సెల్ కార్యదర్శికి అభినందనలు



జీవన్‌ను అభినందిస్తున్న నాయకులు

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శిగా మందస మండలం సవర్ణపురం గ్రామానికి చెందిన బెల్లమర జీవన్‌ను అధిష్టానవర్గం నియమించింది. దీంతో ఆయన్ని పార్టీ జిల్లా యువజన కార్యదర్శి మడియా రామకృష్ణ, నాయకులు బత్తిన లక్ష్మణ్, దున్న గాంధీ, దున్న హరికృష్ణ, దున్న బుజ్జి శనివారం అభినందించారు. తనకు ఈ పదవి దక్కడం కోసం కృషి చేసిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు జీవన్ కృతజ్ఞతలు తెలిజేశారు.

### ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ట్రిసోల్ గ్లోబల్ సర్వీస్ సంస్థకు పది మంది విద్యార్థులు ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావుతో పాటు ప్లేస్‌మెంట్ డీన్ ఎం.సంతోష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

# వానొస్తే వణుకే..!

- రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద
- ఆందోళనలో ప్రజలు



రోడ్డు పైనుంచి వరద ప్రవహిస్తున్న దృశ్యం

మందస: వాన కురుస్తే చాలామంది ఆనందం వ్యక్తం చేస్తారు. పంటలు బాగా పండుతాయని రైతులు, భూగర్భ జలాలు వృద్ధి చెంది నీటి కష్టాలు తీరుతాయని ప్రజలు భావిస్తారు. కానీ మందస మండలం చీపి గ్రామస్తులు మాత్రం చినుకుపడితే వణుకుపోతారు. ఎందుకంటే ఈ గ్రామానికి సమీపంలో కొండలు ఉన్నాయి. వర్షాకాలంలో భారీగా వరద వచ్చి గ్రామానికి వచ్చే రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంటుంది. మందస గ్రామానికి రావాలంటే చీపి గ్రామం సమీపంలోని 30 గ్రామాలకు ఇదే మార్గం. వర్షాకాలంలో చీడి రోడ్డుపై నుంచి భారీగా వరద వస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనాలు తిరగవు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు పిల్లలు ఇబ్బందులు పడుతుంటారు. ఉదయరామచంద్రపురం, చంపాపురం, కోరడాబడి, నారాయణపురం, మురద మేకో, బేత్తుకోల, పద్మపురం, కొండమెర్ర తదితర గ్రామాలకు వెళ్లాలంటే చీపి వద్ద రోడ్డుపై నుంచి ప్రవహించే వరదను దాటాల్సి ఉంటుంది. అత్యవసర పనులపై వెళ్లేవారువె వాగుదాటి వెళ్లి.. తిరిగి ఇళ్లకు చేరేవరకు కుటుంబ సభ్యులు భయంతో కాలాన్ని నెట్టుకొస్తుంటారు. చీపి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఇబ్బందులను తీర్చాలని కోరుతూ స్థానికులు అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు.



వరదలోనే రోడ్డు దాటుతున్న పాదచారులు

### రాకపోకలు బంద్



వర్షా కాలం వస్తే చీపి గ్రామం వద్ద కొండలపై నుంచి వచ్చే వరదతో ఇబ్బందిగా ఉంటుంది. రాకపోకలు నిలిచిపోతాయి. కొండ ప్రాంతాల్లో ఉన్న సుమారు 30 గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన మందస వెళ్లి అత్యవసర పనులు, నిత్యావసర సరుకులు తెచ్చుకోలేని పరిస్థితి. సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు ఎన్నిసార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– పాలక మనోజ్, చీపి గ్రామం

### వర్షా కాలంలో ఇబ్బందే..



వర్షకాలం వస్తే చాలా ఇబ్బందిగా ఉంటుంది. మండల కేంద్రం మందస వెళ్లాలంటే నరకమే. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు చీపి గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి ఆ తరువాత పట్టించుకోవడం లేదు. బిడ్జి కడితే అందరికీ ఉపయోగంగా ఉంటుంది.

–సరక భవాని, ఉదయరామచంద్రపురం

## ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా పండితులను నియమించాలి



తమ్మినాన చందనరావు

వజ్రపుకొత్తూరు: ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా పండితులను నియమించి భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు అన్నారు. సెప్టెంబర్ 14 హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా పరిజ్ఞానం విద్యార్థులకు అవసరమన్నారు. అప్పుడే హైస్కూళ్లలో ఉన్నతమైన విద్యా ప్రమాణాలు సాధించగలుగుతారని అన్నారు. రాష్ట్రంలో 310 మంది హిందీ భాషా పండితులు డీఈవో పూల్‌లో ఉన్నారని వారికి పదోన్నతులు కల్పించి స్థిరమైన హక్షదా, స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక చోట ఉద్యోగం, ఇంకో చోట జీతం తీసుకుంటూ నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. దీని ప్రభావం విద్యార్థుల విద్యాబోధనపై పడుతుందన్నారు. అందువల్ల 2025 డీఎస్సీ నియామకాలకు ముందే హిందీ భాషా పండితుల సమస్యలను పరిష్కారించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సక్రమంగా ఎరువులు సరఫరా చేయాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు


కంచిలి: ఎరువులను రైతులకు సక్రమంగా సరఫరా చేయాలని ఎంపీడీవో వి.తిరుమలరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు సరఫరా చేసే విధానం, నిల్వలను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, పంచాయతీ కార్యదర్శి వై.రాంబాబు ఉన్నారు.

# మంత్రికి పట్టని రైతుల వెతలు

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి

టెక్కలి: వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతుంటే అవేమీ తనకు పట్టనట్టుగా వ్యవహరించడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సుగ్గు రామిరెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులపై లేనిపోని విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్న మంత్రికి రైతులపై అభిమానం ఉంటే ఆయన అనుచరుల గుప్పెట్లో ఉన్న యూరియాను బయటకు తెప్పించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియాకు కొరత లేదని మంత్రి ఒక వైపు ఊకదంపుడు ప్రచారాలు చేస్తున్నారని.. అయితే క్షేత్రస్థాయిలో గ్రామాల్లో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు మంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితుల్లేవని రామిరెడ్డి గుర్తు చేశారు. అచ్చెన్నాయుడుకు పూర్తిగా వ్యవసాయంపై అవగాహన లేకపోవడంతో రైతులకు యూరియా కష్టాలు ఎదురయ్యాయని దుయ్యబట్టారు. యూరియాకు ఎక్కడా కొరత లేదని చెబుతున్నారు తప్పా రైతులకు మాత్రం ఎరువు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే తప్పుడు ప్రకటనలు పక్కన పెట్టి రైతులకు అవసరమైన యూరియాను అందజేయాలని డిమాండ్ చేశారు.

## మృత్యుంజయేశ్వరునికి కిరణ స్పర్శ



కవిటి:మండలంలోని ముత్యాలపేటలో వెలసిన మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శివలింగాన్ని శనివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈ అద్భుతమైన సన్నివేశాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులతో భజన కాలక్షేపాన్ని నిర్వహించారు.

# రసాభాసగా ఉపాధి హామీ గ్రామసభ



విచారణ నివేదిక చదవాలని కోరుతున్న ఫిర్యాదుదారులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామంలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభ రసాబాసగా మారింది. ఈ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల నిర్వాహణతోపాటు బిల్లుల చెల్లింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని స్థానికులు పలువురు ఇదివరకే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం స్థానిక సచివాలయంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఈ అక్రమాలపై సంబంధిత సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో చదివి వినిపించడంతో గందరగోళం చోటుచేసుకుంది. ఫిర్యాదుదారులు శుక్రవారం నాటి విచారణ నివేదికను గ్రామసభలో చదవాలని కోరారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని ఏపీఓ నారాయణరావు తెలియజేశారు. ఉపాధి అక్రమాలపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ సూర్యనారాయణ, సర్పంచ్ రూపావతి, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్, మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు, ఉప సర్పంచ్ మొయ్యి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు



ఇచ్ఛాపురం: అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పరేష్‌కుమార్

సోంపేట: రాజీయే రాజమార్గమని న్యాయమూర్తులు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను వివిధ కోర్టుల సముదాయాల్లో శనివారం నిర్వహించారు. సోంపేట కోర్టుల సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 60 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు తెలిపారు. కోర్టుల సముదాయంలో రెండు బెంచిలలో అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలకు న్యాయం చేకూరుతుందని న్యాయమూర్తులు కక్షిదారులకు తెలియజేశారు. ఒకటవ బెంచిలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, రెండవ బెంచిలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు అదాలత్ నిర్వహించారు. న్యాయవాదులు డి.జోగారావు, ఎస్.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురంలో 200 కేసులు..**

ఇచ్ఛాపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జికోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 200 కేసులకు జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ పరిష్కారం చూపారు. వీటిలో ఎస్టీసీ కేసులు 120, రాజీ పడ్డ కేసులు 55, సివిల్ కేసు ఒకటి, ఎన్ ఐయాక్ట్ కేసులు మూ డు, టైటిల్ కేసులు మూడు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులు ఎనిమిది, మున్సిపాలిటీకి సంబంధించిన కేసులు పది పరిష్కరించగా జరిమానాగా రూ. ఎనిమిది లక్షల 77 వేలు వసూలైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటఅప్పారావు, బార్‌అసోసియేషన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పలాసలో 225 కేసులు..**

పలాస: పలాస కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 225 కేసులు పరిష్కారమయ్యాయి. పలాస మండల న్యాయ సేవా సంఘం, పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో సివిల్ దావాలు ఆరు, క్రిమినల్ కేసులు 33, చెక్ బౌన్స్ కేసులు ఏడు, మనోవర్తి కేసులు రెండు, గృహ హింస కేసు ఒకటి, ఎక్సైజ్ కేసులు 27, క్రిమినల్ జరిమానా కేసులు 145, స్టేట్‌బ్యాంక్ లిటిగేషన్ కేసులు నాలుగు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు పి.జి.రాజరత్నం, ఎస్.వెంకటరమణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పయ్యాజ్ అహ్మద్, బి.కామేశ్వరరావు, ఎం.ఎస్.అనిల్‌రాజు, మురళీమోహన్, వి.రవి, ఎ.రాము, కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ, ఎక్సైజ్ సి.ఐ శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

**టెక్కలిలో 85 కేసులు..**

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల, జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఆధ్వర్యంలో 85 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. సివిల్ కేసులు నాలుగు, క్రిమినల్ కేసులు 45, ఎక్సైజ్ కేసులు 29, హిందూ వివాహ చట్టం కేసు ఒకటి, మనోవర్తి ఒకటి, డీవీసీ ఒకటి, బ్యాంకు రికవరీ నాలుగు కేసులు పరిష్కారం ద్వారా రూ. 9,10,100 సెటిల్‌మెంట్ చేసినట్లు వెల్లడించారు. అదాలత్ సభ్యులు పి.చంద్రుడు, ఐ.మల్లేష్, బి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, న్యాయవాదులు డి.వివేకానంద, పి.బాబూరావు, డి.భుజంగరావు, ఎస్.సూర్యరాజు, పి.సాయిరాజ్, ఎస్.రమణారావు పాల్గొన్నారు.



పలాస:లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు



టెక్కలి: అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి నిర్మల

## అల్లుకున్న నిర్లక్ష్యం..



మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పేరుతో తరచూ విద్యుత్ సరఫరాను సంబంధిత సిబ్బంది నిలిపివేస్తుంటారు. అయితే పనులు ఎక్కడ చేస్తున్నారో అర్థం కావడం లేదు. చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పిచ్చిమొక్కలు విపరీతంగా అల్లుకుని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. టెక్కలి పాతజాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పైకి చుట్టుపక్కల ఉండే పిచ్చి మొక్కలు, పాదుజాతీ తీగలు అల్లుకుపోవడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

## మూఢ నమ్మకాలపై అవగాహన



పలాస మండలం కేశపురం గ్రామంలో శనివారం మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఆ గ్రామంలో ఉంగ రాములను చేతబడి పేరుతో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై మూఢనమ్మకాల నిర్మూలన సమితి, పౌరహక్కుల సంఘాల ప్రతినిధులు ఆ గ్రామానికి వెళ్లి నిజాలను తెలుసుకున్నారు. మూఢ నమ్మకాల పేరిట ఇటువంటి సంఘటనలు జరగకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మూఢ నమ్మకాల నిర్మూలన సమితి జిల్లా అధ్యక్షుడు పిట్ట గీతారాణి, నగరి కరుణాకర్, తుంగాన సూర్య మాస్టార్, పద్మలోచన్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేసు, సోమనాథం, పులారి దుర్యోధనరావు, పిట్ట జోగారావు ఉన్నారు.

–పలాస

## జిల్లేడు ద్రావణంతో ప్రయోజనం



ప్రకృతి వ్యవసాయ విధానంలో జిల్లేడు ద్రావణం ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయని కంచిలి మండల యాంకర్ టి.శివానందం అన్నారు. చిన్నకొజ్జిరియా పంచాయతీ పరిధి చంద్రుపట్టుగ గ్రామంలో రైతు మదన్‌కు చెందిన తోటలో జిల్లేడు ద్రావణం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ ద్రావణం పది లీటర్లను 100 లీటర్ల నీటిని కలిపి ఎకరా పొలంకు పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం వలన చేకూరే ఉపయోగాల్లో వరికి పోటాష్ లోపం లేకుండా చేస్తుందని, రసం పీల్చు పురుగు నివారణకు ఇది బాగా పనిచేస్తుందన్నారు. పంట ఎదుగుదల ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ మీనా పాల్గొన్నారు.

–కంచిలి

# యూరియా సమస్య పరిష్కారానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సోంపేట: యూరియా సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. కొరాం గ్రామంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ, సోంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గ్రామరెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. మరో రెండు రోజుల్లో 60 టన్నుల యూరియా మండలానికి చేరుకుంటుందని చెప్పారు. రైతులకు కూపన్లు అందజేసి సక్రమంగా సరఫరా చేయాలని వ్యవసాయ సహాయకులను కోరారు.

# 28న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలోని సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామంలో వే టు సక్సెస్ సంస్థ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు సీహెచ్ దామోదరరావు, కన్వీనర్ బి.మురళి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 27వ తదీలోగా పేర్లను గూగుల్ ఫారం నింపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8919605849, 8186815051 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# పల్లె వెలుగు బస్సులు పునరుద్ధరించాలి

కొత్తూరు: గ్రామీణ ప్రాంతాలకు గతంలో ఉండే ఆర్టీసీ పల్లె వెలుగు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్‌రావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పూతికవలస గ్రామంలో గిరిజనులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కొత్తూరు నుంచి గొట్టిపల్లి, లబ్బ, పూతికవలస, అంగూరు, కడుము, దిమిలితోపాటు పలు రూట్లలో ఆర్టీసీ సర్వీసులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఈ రూట్లలో బస్సులు లేకపోవడంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇచిత బస్సు పథకం వల్ల ఉపయోగం ఉండటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ హుండీ కానుకల లెక్కింపు రేపు

పాతపట్నం: ఈ నెల 15వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయ హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం తెలిపారు. దేవదాయశాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు డ్రస్ కోడ్ పాటించి పాల్గొనవచ్చన్నారు.